

ప్రచార పర్మిషన్‌.. ఇక సులువు

గతంలో ఎన్నికల ప్రచారానికి అనుమతి కోసం తెల్ల కాగితాలపై రాసి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం 'సువిధ' యాప్‌ను ఎన్నికల సంఘం ప్రవేశపెట్టడంతో అనుమతులు సులువుగా లభిస్తున్నాయి.

- 8లో



లక్షే లక్ష్యం..

టీఎస్‌ ఆర్టీసీ.. ఆదాయం పెంచుకునే దిశలో సరికొత్త చాలెంజ్‌తో ముందుకెళ్లింది. తాజాగా 'లక్షే లక్ష్యం' అనే పేరుతో మరో చాలెంజ్‌ తీసుకువచ్చింది.

- 8లో

గరిష్టం/కనిష్టం 43°/29°

వాతావరణం

ఉదయం నుంచే ఎండ వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వడగాలులు వీస్తాయి. రాత్రి సమయంలో ఉక్కపోత మరింత పెరుగుతుంది.

న్యూస్‌రీల్‌

బాధ్యతలు స్వీకరించిన డీఐఈఓ ఆంజనేయరాజు



జనగామ రూరల్‌: ఇంటర్‌ విద్యాధికారిగా కె.ఆంజనేయరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు డీఐఈఓ పదవీ విరమణ చేయగా ఆయన స్థానంలో డెక్‌ సభ్యుడుగా ఉన్న ఆంజనేయ రాజుకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతులు ఉన్న కళాశాలల్లోనే విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవాలని, లేకుంటే భవిష్యత్‌లో సమస్యలు వస్తాయని సూచించారు. ప్రభుత్వ కళాశాలల్లో అనుభవం కలిగిన అధ్యాపకులు, సకల సౌకర్యాలు ఉంటాయని చెప్పారు. ఉన్నత స్థాయికి ఎదగడానికి ప్రభుత్వ కళాశాలలు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు.

అర్హత లేని వైద్యుడిపై కేసు



జనగామ: పట్టణంలోని సూర్యాపేట రోడ్డు ప్రాంతంలో అర్హత లేని వైద్యుడు చింతకింది యాదగిరికి చెందిన క్లినిక్‌పై డ్రగ్‌ కంట్రోల్‌ అధికారులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. అనుమతి లేకుండా విక్రయిస్తున్న 43 రకాలకు సంబంధించి రూ.45 వేల విలువ చేసే ఆలోపతి మందులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే సదరు అర్హత లేని వైద్యుడిపై పలు సెక్షన్ల కింద క్రిమినల్‌ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వరంగల్‌ ఔషధ నియంత్రణ సహాయ సంచాలకులు డాక్టర్‌ రాజ్యలక్ష్మి, జనగామ, వరంగల్‌ జిల్లా ఔషధ నియంత్రణ అధికారులు బాలకృష్ణ, ఎం.అరవింద్‌కుమార్‌ ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్‌: జిల్లాలో వేసవి క్రీడల శిక్షణ శిబిరాలు నిర్వహించడానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడా అధికారి బి.వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి 31 వరకు 14 ఏళ్ల లోపు బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్‌, వాలీబాల్‌, బాస్కెట్‌ బాల్‌, ఇతర క్రీడల్లో శిక్షణ శిబిరాలు నిర్వహించడానికి ఉత్సాహవంతులైన వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్‌ క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రదేశం, క్రీడా, పూర్తి వివరాలతో కలెక్టరేట్‌లోని ఎస్‌15 నంబర్‌ కార్యాలయంలో ఈనెల 24లోపు దరఖాస్తు అందజేయాలని, మరిన్ని వివరాలకు 91825 52593 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పాలిటెక్నిక్‌లో ఉచిత ప్రవేశం

జనగామ రూరల్‌: శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్‌ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌ శిక్షణ సంస్థ హైదరాబాద్‌ ఆధ్వర్యంలో 2024–25 విద్యా సంవత్సరం డిప్లొమా కోర్సుల్లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి జయంతి ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన బాలికలు, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన అనాథలు, పేదరికంలో ఉన్న బాలికలు, అక్రమ రవాణాకు గురైన బాలికలు, మహిళా సంస్థలో ఉన్న బాలికలు ప్రవేశ పరీక్ష లేకుండా అడ్మిషన్‌ పొందవచ్చని పేర్కొన్నారు. పదో తరగతి పూర్తి చేసిన వారు అర్హులని, డిప్లొమా ఇన్‌ ఎలక్ట్రికల్‌, ఎలక్ట్రానిక్స్‌, సివిల్‌ ఇంజనీరింగ్‌, డిప్లొమా ఇన్‌ కంప్యూటర్‌ ఇంజనీరింగ్‌, కమ్యూనికేషన్‌ ఇంజనీరింగ్‌ వంటి కోర్సుల్లో ప్రవేశాలున్నాయని తెలిపారు. తల్లి లేదా తండ్రి మరణ ధ్రువీకరణ పత్రం, విద్యార్థిని బోనఫైడ్‌, స్టడీ సర్టిఫికెట్లు, 2 ఫొటోలు దరకాస్తుకు జతచేసి కలెక్టరేట్‌లోని జీ6 రూం నంబర్‌లో మే 15లోపు అందజేయాలని సూచించారు.

వైభవంగా రథోత్సవం

లింగాలఘణపురం: నవాబుపేట శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో గురువారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం అనంతరం వేదపండితులు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత ఉత్సవ విగ్రహాలను రథంపై అలంకరించి కోలాటాలు, డోలు వాయిద్యాల మధ్య ఊరేగించారు. ఈఓ లక్ష్మీప్రసన్న, దేవస్థాన కమిటీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ప్రభాకర్‌, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణను వినియోగించుకోవాలి

జనగామ రూరల్‌: టీపీటీఎఫ్‌ ఆధ్వర్యంలో నిర్వహించే టెట్‌ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్‌ అన్నారు. గురువారం శిక్షణ తరగతుల కరపత్రాలను జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 24 నుంచి మే 11 వరకు పట్టణంలోని ఏకశిల హైస్కూల్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్‌ కోసం 9573141365, 9848362672 నంబర్లలో సంప్రదించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య, కార్యదర్శి ఎస్‌ఎస్‌.రాజు, వజ్రయ్య, అకుశావలి, శ్రీరాములు, శ్రీహరి, రాజారెడ్డి, లక్ష్మణ్‌, వరప్రసాద్‌, గణేష్‌, శివ పాల్గొన్నారు.

పొలిటిక్స్‌ షురూ..

ఓవైపు నామినేషన్లు.. మరోవైపు ప్రచారం

- ఉమ్మడి జిల్లాలో మొదలైన రాజకీయ వేడి
- వరంగల్‌, మహబూబాబాద్‌ ఎంపీ స్థానాల్లో గెలుపుపై దృష్టి
- 24న హనుమకొండలో కాంగ్రెస్‌ సభ నిర్వహణకు కసరత్తు
- అదేబాటలో బీఆర్‌ఎస్‌, బీజేపీ అగ్రనేతలు ప్రచారానికి ప్లాన్‌
- నామినేషన్ల దాఖలుకు మంచి ముహూర్తంపై అభ్యర్థుల ఆరా



మడికొండలో సభా స్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు రేవూరి, కడియం, నాగరాజు, సీఎం సలహాదారు వేం

సాక్షి, వరంగల్‌ : ఉమ్మడి జిల్లాలోని వరంగల్‌, మహబూబాబాద్‌ పార్లమెంట్‌ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల వేడి రాజుకుంటోంది. గురువారం నుంచి నామినేషన్ల దాఖలు ప్రారంభమైంది. మరోవైపు కాంగ్రెస్‌, బీజేపీ, బీఆర్‌ఎస్‌ అభ్యర్థుల ప్రచారానికి ఫంక్షన్‌హాళ్లను వేదికగా చేసుకుంటున్నారు. ఆయా పార్టీల ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటుచేసి గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తూ ముందుకెళ్తున్నారు. శుక్రవారం మానుకోటలో సీఎం ప్రచారసభలో పాల్గొనున్నారు. అదేవిధంగా ఈ నెల 24న హనుమకొండలో బహిరంగసభ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

గెలుపే లక్ష్యంగా వ్యూహాలు..

వరంగల్‌ పార్లమెంట్‌ ఎస్సీ రిజర్వ్‌డు, మహబూబాబాద్‌ పార్లమెంట్‌ ఎస్టీ రిజర్వ్‌డు స్థానాలను కాంగ్రెస్‌, బీజేపీ, బీఆర్‌ఎస్‌ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుండడంతో రోజురోజుకూ రాజకీయం వేడెక్కుతోంది. ఈ రెండు స్థానాల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్‌ వ్యూహాలు రచిస్తోంది. అదేవిధంగా అటు బీజేపీ, ఇటు బీఆర్‌ఎస్‌ అగ్రనేతలు కూడా ప్రచారం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌తోపాటు మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌ ప్రచారం చేసేలా ఆ పార్టీ షెడ్యూల్‌ రూపొందించుకుంటోంది. అదే సమయంలో బీజేపీ కూడా జాతీయ అగ్రనేతలతో ప్రచారం ఉండేలా కసరత్తు చేస్తోంది. దీంతో ఆయా పార్టీల ముఖ్యనేతల ప్రసంగాలకు ఉమ్మడి వరంగల్‌ వేదిక కానుంది.

రెండు రోజుల్లో నామినేషన్లు..

తొలిరోజు నామినేషన్ల దాఖలుపై ప్రధాన పార్టీల అభ్యర్థులు ఆసక్తిచూపలేదు. రిజిస్టర్డ్‌, స్వతంత్ర అభ్యర్థులు ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. వరంగల్‌ పార్లమెంట్‌ స్థానం నుంచి కాంగ్రెస్‌ తరఫున కడియం కావ్య, బీజేపీ నుంచి అరూరి రమేశ్‌, బీఆర్‌ఎస్‌ నుంచి డాక్టర్‌ మారేపల్లి సుధీర్‌కుమార్‌ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వీరు నామినేషన్లు దాఖలు చేసేందుకు మంచి ముహూర్తం కోసం ఆరా తీస్తున్నారు. 20వ తేదీలోపే మంచి



నామినేషన్‌ కేంద్రం వద్ద పోలీస్‌ బందోబస్తు

రోజులు ఉండడంతో కొందరు శుక్రవారం, మరి కొందరు శనివారంలోపు నామినేషన్లు దాఖలు చేయవచ్చని ఆయా పార్టీల్లో చర్చ జరుగుతోంది. ఇంకోవైపు ఎన్నికల నోటిఫికేషన్‌ వెలువడడంతో ఆయా పార్టీల నాయకులు గెలుపు కోసం ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను కూడా నియమించాయి. ఈ నెల 24న మడికొండలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రచార సభకు నాయకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కడియం శ్రీహరి పార్టీలోకి వచ్చాక ఆయన ఆధ్వర్యంలో జరుగుతున్న మొదటి సభ కావడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు చెబుతున్నారు. ఈ మేరకు గురువారం పార్టీ పార్లమెంట్‌ ఇన్‌చార్జ్‌ రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్‌ నాగరాజు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిలు సభాస్థలిని పరిశీలించారు.

వీరి జాతకం తేల్చేది ఎంతమందంటే..

వరంగల్‌ లోక్‌సభ పరిధిలో వరంగల్‌ పశ్చిమ, వరంగల్‌ తూర్పు, పరకాల, భూపాలపల్లి, వర్ధన్నపేట, పాలకుర్తి, స్టేషన్‌ ఘన్‌పూర్‌ అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. కొత్త ఓటరు జాబితా ప్రకారం 18,16,543 మంది ఓటర్లున్నారు. వీరిలో 8,91,940 మంది పురుష ఓటర్లు, 9,24,208 మంది మహిళా ఓటర్లున్నారు. మహబూబాబాద్‌ పార్లమెంట్‌ పరిధిలో మహబూబాబాద్‌, డోర్నకల్‌, నర్సంపేట, ములుగుతోపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పినపాక, ఇల్లందు, భద్రాచలం నియోజకవర్గాలున్నాయి. కొత్త ఓటరు జాబితా ప్రకారం 15,30,367 మంది ఓటర్లున్నారు. వీరిలో 7,46,982 మంది పురుష ఓటర్లు, 7,83,280 మంది మహిళా ఓటర్లున్నారు. వీరంతా నాయకుల జాతకం తేల్చనున్నారు.

నామినేషన్‌ సెంటర్‌వద్ద భారీ బందోబస్తు

వరంగల్‌ పార్లమెంట్‌ స్థానానికి వరంగల్‌ కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌ వద్ద పోలీసులు బారికేడ్లు పెట్టి ట్రాఫిక్‌ ఆంక్షలు విధించారు. హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్‌ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఎన్నికల అధికారి, కలెక్టర్‌ పి.ప్రావీణ్య గురువారం నామినేషన్‌ సెంటర్‌లోని ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు తగిన సూచనలు చేశారు.

నేడు మానుకోటకు సీఎం

- ఎన్నికల ప్రచార సభకు హాజరుకానున్న ముఖ్యమంత్రి రేవంత్‌

సాక్షి, మహబూబాబాద్‌: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం మానుకోటకు రానున్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఆయన పార్లమెంట్‌ ఎన్నికల ప్రచార నిమిత్తం జిల్లాకు వస్తున్నారు. కాగా మహబూబాబాద్‌ పార్లమెంట్‌ పరిధిలోని ఏడుగురు కాంగ్రెస్‌ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్‌ ఉదయం నామినేషన్‌ వేస్తారు. సాయంత్రం 4గంటలకు మహబూబాబాద్‌ పట్టణంలోని ఎన్‌టీఆర్‌ స్టేడియంలో జరిగే భారీ బహిరంగ సభకు సీఎం హాజరై ప్రసంగిస్తారు. 6గంటలకు హెలికాప్టర్‌ ద్వారా హైదరాబాద్‌కు వెళ్తారు. కాగా మూడు రోజులుగా సభ ఏర్పాట్లను సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పరిశీలించారు.



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే మురళీనాయక్‌, అభ్యర్థి బలరాంనాయక్‌

గురువారం మంత్రి తుమ్మల జిల్లా పోలీస్‌ అధికారులతో కలిసి సభా వేదిక, హెలిపాడ్‌ను పరిశీలించారు. దంచికొండుతున్న ఎండల నేపథ్యంలో బహిరంగ సభకు జనసమీకరణ స్థానిక నాయకులకు సవాల్‌గా మారింది. గతంలో మాదిరిగా ప్రజలు స్వచ్ఛందంగా సభలకు వచ్చే పరిస్థితి లేదని, వారికి అన్ని ఏర్పాట్లు చేస్తేనే వస్తారని పలువురు నాయకులు చెప్పారు. కాంగ్రెస్‌ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ శుక్రవారం ఉదయమే నామినేషన్‌ వేయనున్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి



స్కూల్లో ఏఈతో మాట్లాడుతున్న పింకేష్‌కుమార్‌

- అదనపు కలెక్టర్‌ పింకేష్‌కుమార్‌

రఘునాథపల్లి: వేసవిలో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవడంతోపాటు అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్‌ పింకేష్‌కుమార్‌ అన్నారు. గురువారం మండల పరిధి గోవర్ధనగిరి, ఖిలాషాపూర్‌, కుసుంబాయితండాలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన తాగునీటి సరఫరాపై అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో చర్చించారు. ఎండల తీవ్రత పెరిగిన దృష్ట్యా ప్రజలకు తాగు నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, ఇప్పటికే రూపొందించిన యాక్షన్‌ ప్లాన్‌ ప్రకారం చర్యలు చేపట్టాలని మిషన్‌ భగీరథ డీఈ కరుణ్‌కుమార్‌ను ఆదేశించారు. అమ్మ ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో చేపట్టిన పనులను పర్యవేక్షించాలని చెప్పారు. ఆయన వెంట పంచాయతీ రాజ్‌ డీఈ శ్రీనివాస్‌, డీఈఓ రాము, ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు, మిషన్‌ భగీరథ ఏఈ లక్ష్మీపతి, పీఆర్‌ ఏఈ తదితరులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్‌ రూంను పరిశీలిస్తున్న రోహిత్‌సింగ్‌

స్ట్రాంగ్‌ రూంను పరిశీలించిన అదనపు కలెక్టర్‌

పాలకుర్తి టౌన్‌: పార్లమెంట్‌ ఎన్నికల నేపథ్యంలో పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌ రూంను గురువారం అదనపు కలెక్టర్‌, ఏఆర్‌ఓ రోహిత్‌సింగ్‌ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఆయన వెంట సీఐ మహేందర్‌రెడ్డి, తహసీల్దార్‌ వెంకటేశం, ఎస్సై సాయిప్రసన్నకుమార్‌, ఎన్నికల టీడీ రామరావు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల సందర్శన

సాక్షి ఎఫెక్ట్‌..

బచ్చన్నపేట: మండల పరిధి బండనాగారం, లక్ష్మాపూర్‌, కేసిరెడ్డిపల్లి, భోనకొల్లూర్‌ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా పౌరసరఫరాల అధికారి రోజారాణి, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్‌ గురువారం సందర్శించారు. బుధవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి ఆయా కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయిన విషయమై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆయా సెంటర్లను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ ధాన్యాన్ని త్వరగా తూకం వేసి వెంటనే మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బండనాగారంలో 26 మంది రైతులు 3,729 బస్తాలు, కేసిరెడ్డిపల్లిలో 36 మంది రైతులు 5,582 బస్తాల ధాన్యం ఇప్పటి వరకు మిల్లులకు చేరినట్లు తెలిపారు. లక్ష్మాపూర్‌లో ధాన్యం తేమ శాతం రానందున ఇంత వరకు కొనుగోలు చేయలేదన్నారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం మద్దతు ధరకు విక్రయించాలని, దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు అమ్ముకోవద్దని సూచించారు. కార్యక్రమంలో సివిల్‌ సప్లయ్‌ డిప్యూటీ తహసీల్దార్‌లు శ్రీనివాస్‌, దేవనాయక్‌, పీఏసీఎస్‌ సీఈఓ బాలస్వామి పాల్గొన్నారు.



లక్ష్మాపూర్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌ఓ

ఆస్పత్రుల రిజిస్ట్రేషన్‌ తప్పనిసరి

జనగామ రూరల్‌: ప్రభుత్వ, ప్రైవేట్‌ ఆస్పత్రులు ఎస్టాబ్లిష్‌మెంట్‌ యాక్ట్‌–2010 ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ హరీష్‌ రాజ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. తనిఖీలు చేపట్టడానికి ఐదు బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు



దేవరుప్పుల పీఎస్‌లో సీపీ అంబర్‌ కిషోర్‌



మొండ్రాయి చెక్‌పోస్టును పరిశీలిస్తున్న సీపీ

- వరంగల్‌ సీపీ అంబర్‌ కిషోర్‌

పాలకుర్తి టౌన్‌/దేవరుప్పుల/కొడకండ్ల : పార్లమెంట్‌ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని వరంగల్‌ పోలీస్‌ కమిషనర్‌ అంబర్‌ కిషోర్‌ అన్నారు. గురువారం పాలకుర్తి, దేవరుప్పుల పోలీస్‌స్టేషన్లతో పాటు కొడకండ్లలోని జనగామ –సూర్యాపేట రహదారి మొండ్రాయి వద్ద పోలీస్‌ చెక్‌ పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ల పరిసరాలు, కార్యాలయ నిర్వహణ తీరు, పెండింగ్‌ కేసుల రికార్డులు, విధుల తీరుపై ఆరా తీశారు. ఎన్నికల కోడ్‌ నిబంధనలు పాటించేలా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా సిబ్బందికి సూచించారు. అంతకు ముందు శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి, ఎస్సైలు సాయి ప్రసన్నకుమార్‌, ఎస్‌.చెన్నకేశవులు, బండి శ్రావణ్‌ కుమార్‌, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ చేయాలి

- కలెక్టర్‌ షేక్‌ రిజ్వాన్‌ బాషా

జనగామ రూరల్‌ : నియోజకవర్గాల వారీగా ఎన్నికల సామగ్రిని పంపిణీ చేయాలని కలెక్టర్‌ షేక్‌ రిజ్వాన్‌ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎన్నికల సెల్‌లో సామగ్రిని పరిశీలించి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్‌ నియమ నిబంధనల ప్రకారం జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు సామగ్రి ఎప్పటికప్పుడు పంపిణీ చేసి వివరాలు నమోదు చేయాలని చెప్పారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుని ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సామగ్రి నోడల్‌ అధికారి కుమారస్వామి, ఏఓ రవీందర్‌, సూపరింటెండెంట్‌ శ్రీనివాస్‌ పాల్గొన్నారు.



ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్‌

ఆరు గ్యారంటీలతో ప్రజాసంక్షేమ పాలన

- డాక్టర్‌ వర్రె వెంకటేశ్వర్లు

జనగామ: సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలతో ప్రజాసంక్షేమ పాలన అందిస్తున్నారు.. ఆయన నాయకత్వాన్ని బలపరుస్తూ కాంగ్రెస్‌ పార్టీ భువనగిరి పార్లమెంట్‌ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రధాన సమాచార కమిషనర్‌ డాక్టర్‌ వర్రె వెంకటేశ్వర్లు కోరారు. గురువారం సమాచార హక్కు వికాస సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి, ప్రేమ సేవా సదన్‌ డైరెక్టర్‌ మహమ్మద్‌ ఖుర్షీద్‌ పాషా అధ్యక్షతన స్థానిక ఓ ఫంక్షన్‌ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ జీఓలు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా ఆన్‌లైన్‌కు శ్రీకారం చుట్టిన సీఎంకు అభినందలు తెలిపారు. సమాచార హక్కు వికాస సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రమాద కృష్ణారెడ్డి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సమగ్రంగా అమలు కావాలంటే కాంగ్రెస్‌ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. సీనియర్‌ జర్నలిస్టు, సమాచార హక్కు వికాస సమితి ముఖ్య సలహాదారులు కన్న పరశురాములు, వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు ఎస్‌.రవి, ఉపాధ్యక్షులు శ్రీను, శ్రీకాంత్‌, నాగరాజు, వరంగల్‌ జిల్లా అధ్యక్షుడు పూర్ణచందర్‌, సీనియర్‌ న్యాయవాది ఉమాపతి, మాజీ ఎంపీపీ గోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బేకరీ సీజ్‌.. జరిమానా

జనగామ: పట్టణ పరిధి సిద్దిపేటరోడ్డులోని డీఎఫ్‌సీ ఫుడ్‌ కోర్టు, బేకరీని సీజ్‌ చేసి రూ.5వేల జరిమానా విధించినట్లు జిల్లా ఇన్‌చార్జ్‌ ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌ సి.కృష్ణమూర్తి తెలిపారు. పలువురు వినియోగదారుల ఫిర్యాదు మేరకు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశామన్నారు. లిక్విడ్‌ కారామిల్‌ గడువు ముగిసిన తర్వాత కేకుల తయారీలో వినియోగిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. అలాగే దిల్‌ఖుష్‌, క్రీమ్‌బన్‌ నమూనాలు సేకరించి హైదరాబాద్‌ ఆహార ప్రయోగశాలకు పంపించినట్లు పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్‌ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ మల్లిగారి మధు ఆధ్వర్యంలో బేకరీ సీజ్‌ చేసినట్లు స్పష్టం చేశారు. హోటళ్లు, బేకరీలు, రెస్టారెంట్లు ఇతర ఆహార పదార్థాల తయారీ, అమ్మకందారులు నాణ్యత, పరిశుభ్రత పాటించి కస్టమర్లకు స్వచ్ఛమైన వాతావరణం కల్పించాలన్నారు. లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని కృష్ణమూర్తి హెచ్చరించారు.



బేకరీ యజమానికి జరిమానా విధిస్తున్న అధికారి

లక్ష్యానికి దూరం..!

- ఇంకుడు గుంతల నిర్మాణంపై నిర్లక్ష్యం
- క్షేత్రస్థాయి ప్రజల్లో అవగాహన కరువు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- నీరుగారుతున్న సర్కారు లక్ష్యం



జనగామ రూరల్‌: భూగర్భ జలాలను పెంపొందించేందుకు గ్రామాలు, పట్టణాల్లో ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా.. అధికారుల నిర్లక్ష్యం కారణంగా క్షేత్రస్థాయిలో ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ప్రతి వేసవిలో వాగులు, చెరువుల్లో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. మరోవైపు తాగు నీటికి తిప్పలు తప్పడంలేదు. ప్రతి నీటిబొట్టును ఒడిసి పట్టి సమస్యను అధిగమించడానికి మొదట ఇంకుడు గుంతల కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టినా ఆ తర్వాత అధికారులు గాలికి వదిలేశారు. గత ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవడంతో భూగర్భజలాల మట్టం పెరిగింది. పంటల సాగు కూడా పెరిగింది. అయితే ఫిబ్రవరి నుంచే ఎండలు మండి పోతుండడంతో భూగర్భజలాలు తగ్గిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో భూగర్భజలాల పెంపునకు ఇంకుడు గుంతలు ఆధారం కానున్నాయి. ఇంకుడు గుంతలతో కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు తెలియకపోవడం.. నిర్మాణం చేపట్టిన వారికి సకాలంలో బిల్లులు రాక ఏగ్రామంలోనూ నూరు శాతం పూర్తికాలేదు. కొంత మంది ఇంకుడు గుంతలు నిర్మించుకోవడానికి సిద్ధంగా ఉన్నా అధికారులు వాటిపై స్పష్టత ఇవ్వడం లేదు. జిల్లాకు 48,962 ఇంకుడు గుంతలు మంజూరు కాగా ఇప్పటి వరకు 22,743 మాత్రమే పూర్తయ్యాయి.

జిల్లాకు మంజూరైన ఇంకుడు గుంతలు

బచ్చన్నపేట	3,151	లింగాలఘణపురం	6,631
చిల్పూర్‌	3,601	నర్మెట	3,311
దేవరుప్పుల	4,297	పాలకుర్తి	4,126
స్టేషన్‌ఘన్‌పూర్‌	4,230	రఘునాథపల్లి	2,857
జనగామ	5,063	తరిగొప్పుల	3,149
కొడకండ్ల	3,672	జఫర్‌గఢ్‌	4,874

బిల్లుల్లో జాప్యం.. కొరవడిన అవగాహన

అధికారుల సూచన మేరకు కొంత మంది ఇంకుడు గుంతలు నిర్మించుకున్నారు. ఒక్కో ఇంకుడు గుంత నిర్మాణానికి ప్రభుత్వం రూ.6,000 చెల్లిస్తుండగా.. ఖర్చు అంతకంటే ఎక్కువ అవుతుండడంతో చాలా మంది ఆసక్తి చూపడం లేదు. నిర్మాణం పూర్తయిన వాటికి బిల్లులు సకాలంలో రాకపోవడం.. నిర్మాణ సామగ్రి సొంత డబ్బుతో తెచ్చుకున్నప్పటికీ ప్రభుత్వం నుంచి సహకారం అందుతుందో లేదో అనే అనుమానంతో మరి కొందరు ముందుకు రావడం లేదు. జిల్లా వ్యాప్తంగా చాలా వరకు ఇంకుడు గుంతలు పెండింగ్‌లోనే ఉన్నాయి. 10 వేలకు వరకు పురోగతిలో ఉన్నాయి. అనేక మంది గుంతలు తవ్వి మధ్యలోనే వదిలేశారు. మరి కొందరు బిల్లులు వస్తే నిర్మించుకుంటామని చెబుతున్నారు.



పక్క ఫొటోలోని వ్యక్తి పేరు కోల శ్రీనివాస్‌. స్టేషన్‌ ఘన్‌పూర్‌ మండలం శివునిపల్లి. రెండేళ్ల క్రితం ప్రభుత్వ ఆదేశాలతో ఇంకుడు గుంత నిర్మించుకున్నాడు. ప్రభుత్వం చెల్లించే రూ.6,000 వేలకు మరో రూ.4వేలు అదనంగా అయ్యాయి. అప్పుచేసి నిర్మాణం పూర్తి చేస్తే ఇంత వరకు డబ్బు రాలేదు. 'అదనంగా అయిన ఖర్చు కూడా ప్రభుత్వమే బిల్లుతో చెల్లించాలి' అని శ్రీనివాస్‌ కోరాడు.

జిల్లాకు మంజూరైనవి	48,962
ఇప్పటి వరకు పూర్తయినవి	22,743

నాలుగేళ్లవుతున్నా బిల్లు రాలేదు



కట్కూర్‌ గ్రామంలో 27 ఇంకుడు గుంతల నిర్మాణం కాంట్రాక్ట్‌కు తీసుకుని పూర్తి చేశాం. అప్పు తెచ్చి నిర్మాణాలు చేపడితే ఇప్పటి వరకు కేవలం రూ.20 వేలు మాత్రమే వచ్చాయి. ఇంకా 1.42 లక్షలు రావాల్సి ఉంది. నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్నాను. అధికారులు స్పందించి బిల్లులు ఇప్పించాలి.

- చేవాన్‌ నరేష్‌, కాంట్రాక్టర్‌, కట్కూర్‌(జనగామ)

ప్రతి ఇంటిలో నిర్మించుకోవాలి



అడుగంటుతున్న భూగర్భ జలాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి. ప్రభుత్వం నిర్మాణ ఖర్చు చెల్లిస్తుంది. గతంలో బిల్లులు రానివారి వివరాలు పరిశీలించి వచ్చేలా కృషి చేస్తాం. కొంత ఆలస్యమైనా నిర్మాణం పూర్తి చేసిన వారికి బిల్లులు వస్తాయి. క్షేత్ర స్థాయిలో అధికారులతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి లక్ష్యం పూర్తయ్యేలా ప్రయత్నం చేస్తాం.

- మొగిలప్ప, డీఆర్‌డీఓ జనగామ

ప్రచార పర్మిషన్.. ఇక సులువు

'సువిధ' యాప్‌తో సులభం..
- 48 గంటల్లోనే అనుమతులు
- గతంలో కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి..
- నేడు అంతా ఆన్‌లైన్‌లోనే..



ఖిలా వరంగల్: గతంలో ఎన్నికల ప్రచారానికి సంబంధించి ఓ సమావేశం నిర్వహించాలంటే అనుమతి కోసం తెల్ల కాగితాలపై రాసి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అధికారులకు సమయం దొరికినప్పుడు అనుమతులిచ్చేవారు. ఈ విధానం నాయకులకు తలనొప్పిగా ఉండేది. ప్రస్తుతం అనుమతులు సులువుగా లభిస్తున్నాయి. దీనికి కారణం ఓ యాప్. ఎన్నికల సంఘం 'సువిధ' అనే పేరుతో యాప్ ప్రవేశపెట్టింది. దీని వల్ల సమావేశాల అనుమతుల జారీకి అధికారుల వద్దకు వెళ్లాల్సిన పనిలేదు. యాప్‌లో దరఖాస్తు చేసుకుంటే చాలు.. అనుమతులు జారీ చేస్తారు. వరంగల్ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి గురువారం నామినేషన పత్రాల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమైంది. నామినేషన్ల ఘట్టం పూర్తికాగానే ప్రచారం జోరుగా సాగనుంది. ప్రధాన పార్టీలు సభలు, సమావేశాలపై దృష్టి సారించనున్నాయి. ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటారు. ర్యాలీలతో హోరెత్తిస్తారు. అయితే అభ్యర్థులు ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించాలన్నా.. ముందస్తు అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఇందుకు 'సువిధ' యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

పార్లమెంట్ పరిధిలో కలెక్టర్..
వరంగల్ పార్లమెంట్ పరిధిలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఒక పార్టీకి చెందిన ప్రచార వాహనం పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో తిరగాల్సి వస్తే ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించే కలెక్టర్ అనుమతిస్తారు. ప్రధాన నాయకులు హెలికాప్టర్లలో వస్తే దీని అనుమతి కలెక్టర్ వద్దే తీసుకోవాల్సి ఉంటుంది. ఇది కూడా 'సువిధ' ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

అసెంబ్లీ పరిధిలో ఏఆర్వోలు ..
పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రచారానికి ఏఆర్వోలు అనుమతులు జారీ చేస్తారు. నియోజకవర్గ పరిధిలో వాహనాలు, ప్రజలతో కలిసి ర్యాలీలు, తాత్కాలిక ఎన్నికల కార్యాలయాల ఏర్పాటు, లోడ్ స్పీకర్లు , జెండాలు, పోస్టర్ల వినియోగం, ఇంటింటి ప్రచారం.. ఇలా ఏ కార్యక్రమానికైనా అనుమతి పొందాల్సిందే.

'సువిధ' యాప్‌లో ఇలా దరఖాస్తు చేసుకోవాలి..
- సెల్‌ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ ద్వారా 'సువిధ' యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలి.
- సమావేశం నిర్వహించే వివరాలతో పాటు తమకు ఏ విధమైన అనుమతులు కావాలో అందులో నమోదు చేయాలి.
- అనుమతులకు సంబంధించి మీసేవ కేంద్రంలో చలాన్ చెల్లించాల్సి ఉంటుంది. చెల్లించిన చలాన్ రసీదు, 'సువిధ' యాప్‌లో నమోదు చేసిన వివరాలు రిటర్నింగ్ అధికారికి, అసెంబ్లీ పరిధిలోని ఏఆర్వో కార్యాలయాల్లో అందజేయాలి.
- ఎలాంటి జాప్యం లేకుండా దరఖాస్తులు ఎన్నికల అధికారులకు చేరిన 48 గంటల్లోనే అనుమతులు జారీ చేస్తారు.
- అనుమతి జారీలో జాప్యం జరిగితే సంబంధిత రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవచ్చు.



గస్తీ షురూ..!

కమిషనరేట్ పరిధిలో 23చెక్ పోస్టులు
- నిరంతరం ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల తనిఖీలు
- రూ.49వేల వరకు అనుమతి
- చెక్‌పోస్టులను తనిఖీ చేస్తున్న సీపీ

వరంగల్ క్రైం: లోక్‌సభ ఎన్నికల వేడి మొదలైంది. దీంతో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గురువారం నుంచి తనిఖీలు మొదలయ్యాయి. ఇప్పటికే బెల్ట్ షాపులు నిర్వహించుకుండా ఆయా పోలీస్ స్టేషన్‌ల పరిధిలో కఠిన చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులు నిర్వహించినా.. సమయ పాలన తర్వాత మద్యం విక్రయించిన వారిపై కేసులు నమోదు చేసి తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేస్తున్నారు. గతంలో కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు చేసి.. ఎన్నికలకు ఎక్కువ సమయం ఉన్నందున ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఎత్తివేసిన చెక్‌పోస్టులను పోలీస్ అధికారులు తిరిగి గురువారం నుంచి ప్రారంభించారు. ప్రతి చెక్ పోస్టులో పకడ్బందీగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా పర్యవేక్షిస్తున్నారు. చెక్‌పోస్టుల దగ్గర భారీగా పోలీస్ సిబ్బందిని మోహరించి ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. అనుమానాస్పందంగా కనిపించే వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

కమిషనరేట్‌లో చెక్‌పోస్టులు ఇవే..
వరంగల్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా పోలీస్ అధికారులు 23 చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. వరంగల్ పార్లమెంట్ నియోజవర్గం పరిధిలోని అసెంబ్లీ నియోజవర్గాల పరిధిలో చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఈస్ట్‌జోన్ పరిధిలో నర్సంపేట నియోజకవర్గంలో అయ్యప్ప గుడి, నల్లబెల్లి మండలం బోల్లోనిపల్లి, ఖానాపూర్ మండలం అశోక్‌నగర్, వరంగల్ తూర్పు నియోజవర్గం పరిధిలో లేబర్ కాలనీ జాన్‌పాక పీరీలు, నాయుడు పెట్రోల్ పంపు, వర్ధన్నపేట నియోజవర్గంలో హసన్‌పర్తిలోని అనంతసాగర్, డీసీతండా, చింత నెక్కొండ, సెంట్రల్ జోన్ పరిధిలో.. వరంగల్ పశ్చిమ నియోజవర్గం పరిధిలో కాజీపేట డిజిల్ కాలనీ, ఐశ్వర్యగార్డెన్ ములుగురోడ్డు, సీఎస్ఆర్ గార్డెన్, పరకాల నియోజవర్గ పరిధిలో కటాక్షపూర్ క్రాస్, గీసుగొండ కొమ్మాల, నడికూడ, హుజూరాబాద్ నియోజవర్గంలో ఎల్కతుర్తి పెంచికలపేట, స్టేషన్‌ఘనపూర్ పరిధిలో లింగాలఘణపురం జీడికల్, జఫర్‌గడ్ నల్లబండ, సాక్షి కార్యాలయం రాంపూర్, పాలకుర్తి నియోజవర్గంలో దేవరుప్పుల మండల కేంద్రం, రాయపర్తి కిష్టపూర్ క్రాస్, జనగామ నియోజవర్గం పరిధిలో.. జనగామ పెంబర్తి, బచ్చన్నపేట కొన్నె క్రాస్ వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు.


పెంబర్తి చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపడుతున్న పోలీసులు

24 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు..
23 చెక్ పోస్టులతోపాటు కమిషనట్ పరిధిలో 24 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశారు. వీటితోపాటు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) బృందాలను 25 నియమించారు. ఇవి రెండు మండలాలకు ఒక బృందం చొప్పున పనిచేస్తాయి. ఒక్కో చెక్‌పోస్టులో 8మంది సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుళ్లు, ఆరుగురు సివిల్ కానిస్టేబుళ్లు, ఇద్దరు రెవెన్యూ సిబ్బంది, ఒక రెవెన్యూ అధికారి.. ప్రతి చెక్‌పోస్టులో వీడియోగ్రాఫర్ ఉంటారు. సరైన పత్రాలు ఉంటే రూ.49,900వరకు వెంట తీసుకెళ్లేందుకు అనుమతిస్తారు. 7ఫుల్ బాటిల్స్, కాటన్ (12) బీర్ల వరకు అనుమతి ఉంటుంది. రాజకీయ పార్టీల ప్రచార వస్తువులు వెంట ఉంటే వారి దగ్గర రూ.10వేలు నగదు ఉన్న సీజ్ చేస్తారు. చెక్ పోస్టులతోపాటు ఎంసీసీ బృందాలు కూడా అడుగడుగునా తనిఖీలు చేపడుతాయి.

రూ.7.14 లక్షల నగదు పట్టివేత


రామన్నపేట: వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

రామన్నపేట : లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పోలీసులు గురువారం పలుచోట్ల వాహన తనిఖీలు చేపట్టారు. ఇందులో ఆధారం లేకుండా తరలిస్తున్న నగదు మొత్తం 7.14 లక్షల నగదు పట్టుకున్నారు. వరంగల్ ఏసీపీ బి.నందిరాం ఆధ్వర్యంలో గురువారం నగరంలోని పోచమ్మమైదాన్ సెంటర్‌లో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న డబ్బులు స్వాధీనం చేసుకున్నారు. వరంగల్‌కు చెందిన బండారి మణికంఠ నుంచి రూ.2.80 లక్షలు, షేక్ జిజ్వాద్ వద్ద రూ.84 వేలు, నద్దునూరి రవి వద్ద రూ.63 వేలు, తుపాకుల శ్రీకాంత్ వద్ద రూ.56వేలు, సార భాస్కర్ వద్ద రూ.54వేలు.. మొత్తం రూ.4.65 లక్షలు స్వాధీనం చేసుకుని ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఇన్‌చార్జ్‌కు అప్పగించారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో రూ.లక్ష..
స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేస్టేషన్ వద్ద గురువారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.లక్ష నగదు పట్టుకున్నట్లు సీఐ ముస్క రాజు తెలిపారు. మండలంలోని మాన్‌సింగ్‌తండాకు చెందిన భూక్య రవీందర్ బైక్‌పై ఘన్‌పూర్ నుంచి మాన్‌సింగ్ తండాకు వెళ్తుండగా తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లేని రూ.లక్ష లభించడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

చిల్పూరులో రూ.1.49 లక్షలు..
చిల్పూరు: మండల పరిధి వెంకటాద్రిపేట–తరిగొప్పుల రోడ్డులో గురువారం రూ.1.49 లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపారు. వెంకటేశ్వరపల్లి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా చిల్పూరు పంచాయతీ పరిధి వడ్డెగూడెనికి చెందిన కస్తూరి వెంకట్రాజం బైక్‌పై వెళ్తుండగా అనుమానం వచ్చి తనిఖీ చేసినట్లు చెప్పారు. ఆధారాలు లేని నగదు పట్టుకుని సీజ్ చేసినట్లు వివరించారు.



నామినేషన్ల ప్రక్రియ షురూ!

- వరంగల్ పార్లమెంట్ స్థానానికి మొదటి రోజు మూడు దాఖలు..

కాజీపేట్ సెంటర్ : లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. వరంగల్ ఎస్సీ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి మొదటి రోజు మూడు నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ (రిజిస్టర్డ్ పార్టీ) అభ్యర్థిగా అంబోజు బుద్దయ్య, ఇండిపెండెంట్(స్వతంత్ర)అభ్యర్థిగా బరిగెల శివ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా(రిజిస్టర్డ్ ఆన్ రికగ్నైజ్) పార్టీ అభ్యర్థినిగా తౌటపల్లి నర్మదా ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ వేశారని రిటర్నింగ్ అధికారి కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు.


కలెక్టరేట్‌లోని ఆర్‌ఓ కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేస్తున్న బుద్దయ్య

బీఫాంలు అందుకున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులు



కేసీఆర్ చేతుల మీదుగా బీఫాంలు అందుకుంటున్న సుధీర్ కుమార్, కవిత

హన్మకొండ/మహబూబాబాద్: బీఆర్‌ఎస్ వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థులు మారపల్లి సుధీర్‌కుమార్, మాలోత్ కవిత బీఫాంలు అందుకున్నారు. గురువారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో పార్లమెంట్ అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. సమావేశం అనంతరం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. ఎంపీ అభ్యర్థులకు బీ ఫాంలు అందజేశారు. కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, సిరికొండ మధుసూదనాచారి, సత్యవతి రాథోడ్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, మాజీ ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, రెడ్యా నాయక్ , హరిప్రియ, తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై ముగ్గులతో చైతన్యం


ముగ్గులను పరిశీలిస్తున్న శ్రద్ధాశుక్లా

ఓటు హక్కు ప్రాధాన్యంపై మహిళలకు అవగాహన కలిగించేలా గురువారం జిల్లా కలెక్టరేట్ ఎదుట వివిధ శాఖల మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా ముగ్గులను పరిశీలించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

\- హన్మకొండ అర్బన్

కోడిపిల్లను గాబులో వేశాం.. ఇక తిరుగేలేదు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బయ్యారం: ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో కాంగ్రెస్ పార్టీ కాని కోడిపిల్ల(భద్రాచలం ఎమ్మెల్యే) ను గాబులో వేశాం.. ఇక కాంగ్రెస్‌కు తిరుగేలేదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మహబూబాబాద్‌లో శుక్రవారం నిర్వహించే సీఎం బహిరంగసభకు జనసమీకరణ నిమిత్తం గురువారం బయ్యారంలోని కోదండ రామచంద్రస్వామి ఫంక్షన్‌హాల్‌లో గార్ల–బయ్యారం మండలాల్లోని పార్టీ ముఖ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న పది ఎమ్మెల్యే స్థానాల్లో గత ఎన్నికల్లో తొమ్మిది స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలవగా భద్రాచలంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలిచారన్నారు. ఇప్పుడు ఆ అభ్యర్థి (కోడిపిల్లగా మంత్రి సంబోధించారు) కాంగ్రెస్‌లో చేరడంతో పదికి పది కాంగ్రెస్ పార్టీ పక్షాన ఉన్నాయని.. ఇక మనం ఏ అభివృద్ధి పని గురించి అడిగినా సీఎం రేవంత్ ప్రాధాన్యం ఇస్తారన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై కొందరు విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చే తీర్పుతో మిగతా పార్టీల దుకాణాలు ఖాళీ అవుతాయన్నారు. సీఎం బహిరంగ సభకు పార్లమెంట్‌స్థానం పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి లక్ష మందిని తరలించనున్నామన్నా రు. ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌ను గె లిపించే బాధ్యత తీసుకుంటే అభివృద్ధి చేసే బాధ్య త తాము తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్, నియోజకవర్గ కోఆర్డినేటర్ వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, గార్ల జెడ్పీటీసీ ఝాన్సీ, ఎంపీపీ నాగరాజు, బయ్యారం, గార్ల మండలాల పార్టీ అధ్యక్షులు ముసలయ్య, రామారావు, సొసైటీ చైర్మన్లు మధుకర్‌రెడ్డి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కావ్యకు నాకంటే ఎక్కువ మెజార్టీ తీసుకువస్తా

- మంత్రి కొండా సురేఖ

వరంగల్: వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించడమే కాకుండా అసెంబ్లీ ఎన్నికల్లో తనకు వచ్చిన మెజార్టీ కంటే ఎక్కువ సాధిస్తామని మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం రాత్రి పోచమ్మమైదాన్‌లోని అబ్బాస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వరంగల్ తూర్పు నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, ఎంపీ అభ్యర్థి కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ కొండా దంపతులు సన్మానాలకు దూరమన్నారు. సన్మానాలకు అయ్యే ఖర్చుతో అనాథలకు భోజనం అందించాలన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం వచ్చిందని, ఆరు గ్యారంటీల్లోని ఐదింటిని 100 రోజుల్లో అమలు చేశామన్నారు. అంబేడ్కర్‌పై మాట్లాడే నైతిక విలువ కేసీఆర్‌కు లేదని, రాజకీయాల్లోకి అసభ్య పదజాలం తీసుకువచ్చింది కేటీఆర్, కేసీఆర్‌లే అని గుర్తించాలన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్టానం టికెట్ ప్రకటించిన క్షణం.. కొండా దంపతులు తన బిడ్డకు నిండు ఆశీర్వాదం అందించారన్నారు. ఎంపీ అభ్యర్థి కావ్య మాట్లాడుతూ రాజకీయాల్లో ఎలా ముందుకు పోవాలో కొండా సురేఖ చెబుతున్నారని, ఈ సమావేశం చూస్తే తన గెలుపు ఖాయం అనిపిస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు మాట్లాడుతూ కొండా మురళీధర్ మాట ఇస్తే.. తప్పడన్నారు. కడియం కావ్యకు 50వేల మెజార్టీ ఇస్తామన్నారు. ఈసందర్భంగా కాంగ్రెస్‌లో చేరిన పలువురికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్పొరేటర్లు, నాయకులు నవీన్‌రాజు, ప్రకాశ్, ప్రభాకర్, శ్రీనివాస్, శ్రీనివాస్, రాజేష్, రవీందర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి సురేఖ

ఎన్నికల ఖర్చులు లెక్కించండి

- ఎన్నికల సంఘం వ్యయ పరిశీలకులు
- జిల్లా అధికారులతో సమీక్ష


సమీక్షిస్తున్న ఎన్నికల కమిషన్ వ్యయ పరిశీలకులు, చిత్రంలో కలెక్టర్ ప్రావీణ్య

కాజీపేట్ సెంటర్: పార్లమెంట్ అభ్యర్థుల ఖర్చుల వివరాల్ని ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు నమోదు చేయాలని భారత ఎన్నికల కమిషన్ వ్యయ పరిశీలకులు ఏ.ధిలీబన్, ధీరజ్ సింగా అన్నారు. రిటర్నింగ్ అధికారి, గురువారం వరంగల్ కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీఆర్‌ఓ శ్రీనివాస్‌తో కలిసి వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్ల ఎన్నికల వ్యయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్నికల్లో వ్యయ లెక్కింపునకు ఏర్పాట్లు చేసిన కమిటీలు, బృందాలు ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న అప్పగించిన నగదు, మద్యం, తదితర వివరాల్ని ఎస్ఎస్‌టీఎఫ్ఎస్‌టీ బృందాలు వ్యయ పరిశీలకులకు వివరించారు. ఈ సందర్భంగా ధిలీబన్ ధీరజ్ సింగా మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఆమోద, ఆమోద యోగ్యం కాని ప్రతీ ఖర్చును సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ టీమ్, వీఎస్‌టీవీవీ టీలు నమోదు చేయాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్ షోలన్నింటినీ వీడియో సర్వేలెన్స్ టీమ్ సభ్యులు రికార్డ్ చేయాలన్నారు. అభ్యర్థుల వ్యయ వ్యయ రిజిస్టర్‌లు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అనుమతి తీసుకున్న వాహనాల కంటే ఎక్కువ ఉపయోగిస్తే అనుమతి రద్దు చేయాలన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టేలా ఉచిత కానుకల్ని పంపిణీ చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా నోడల్ అధికారులు, రామిరెడ్డి, సంజీవ రెడ్డి, పుష్పలత, అయుబ్ అలీ, జిల్లా ఎక్సైజ్ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తలంబ్రాల బుకింగ్ గడువు పొడిగింపు

హన్మకొండ: భద్రాద్రి సీతారాముల కల్యాణ తలంబ్రాలు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో బుక్ చేసుకునేందుకు ఈనెల 25 వరకు గడువు పెంచినట్లు ఆర్టీసీ కార్గో వరంగల్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ శ్రావణ్ కుమార్ తెలిపారు. బుక్ చేసుకున్న భక్తులకు నేరుగా తలంబ్రాలు అందించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తలంబ్రాల కోసం డిపోల వారీగా ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించవచ్చని సూచించారు. వరంగల్–1 డిపో 91542 98759, హనుమకొండ 91542 98761, జనగామ డిపో 91542 98762, పరకాల, భూపాలపల్లి డిపో 91542 98764, నర్సంపేట 91542 98763, తొర్రూరు 91542 98766, మహబూబాబాద్ 91542 98768, వరంగల్ రీజియన్ 93913 20465 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

గూడ్స్ షెడ్డు సమీపంలో అగ్నిప్రమాదం

కాశిబుగ్గ : వరంగల్ రైల్వే గూడ్స్ షెడ్డు సమీపంలో గురువారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈఘటనలో ఎలాంటి నష్టం జరగలేదు. అగ్నిమాపక అధికారుల కథనం ప్రకారం.. వరంగల్ తాత్కాలిక బస్టాండ్ వెనుక, వరంగల్ రైల్వే గూడ్స్ షెడ్డు సమీపంలోని టేకు చెట్లలో అగ్ని ప్రమాదం జరిగింది. దీనిపై సమాచారం అందడంతో సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఎవరో సిగరెట్ తాగి పడేయగా ఎండిన చెట్ల ఆకులకు అంటుకుని ఈ ఘటన జరిగిందని తెలిపారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో బీడీ, సిగరెట్ తాగి ఎక్కడ పడితే వేయొద్దన్నారు. కాగా, అగ్నిప్రమాదం జరగడంతో ప్రయాణికులు కొంత ఆందోళనకు గురయ్యారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


వంశీ(ఫైల్)

పాలకుర్తి టౌన్: ఇంటర్మీడియట్ పరీక్షల్లో మరోసారి ఫెయిల్ అవుతానేమోనని భయంతో ఓ విద్యార్థి మనస్థాపానికి గురై ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై సాయి ప్రసన్నకుమార్ కథనం ప్రకారం పాలకుర్తికి చెందిన ఈరంటి వంశీ(19) గత సంవత్సరం సంవత్సరం ఇంటర్మీయట్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడు. ఇంటి వద్ద ఉంటూనే ఇటీవల సప్లిమెంటరీ పరీక్ష రాశాడు. అయితే ఇందులో కూడా ఫెయిల్ అవుతానేమోననే భయంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, బుధవారం రాత్రి వరకు స్నేహితులతో కలిసి ఉండి ఇంటికి వచ్చిన తర్వాత భోజనం చేసి అర్ధరాత్రి ఉరి వేసుకొని ఆత్మహ్యకు పాల్పడినట్లు సమాచారం.

నేడు మావోయిస్టు దంపతుల అంత్యక్రియలు

- శుక్రవారం స్వగ్రామానికి చేరుకోనున్న సుధాకర్, రజిత మృతదేహాలు
- చల్లగరిగెలో విషాదఛాయలు

చిట్యాల: ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేరు జిల్లా మాడ్ ప్రాంతంలో నాలుగు రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు దంపతులు సిరిపెల్లి సుధాకర్ అలియాస్ శంకర్‌రావు, అతడి భార్య దాశశ్వర్ సుమన అలియాస్ రజిత మృతదేహాలు శుక్రవారం స్వగ్రామం చల్లగరిగెకు చేరుకోనున్నాయి. ఇదే రోజు కుటుంబీకులు.. సుధాకర్, రజిత అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కాగా, సుధాకర్ దంపతుల మృతదేహాలను తీసుకురావడానికి కుటుంబీకులతోపాటు గ్రామస్తులు బుధవారం ఛత్తీస్‌గఢ్ బయలుదేరగా గురువారం చేరుకున్నారు. మార్చురీలో ఉన్న మృతదేహాలను గుర్తించారు. శుక్రవారం ఉదయం చల్లగరిగెకు తీసుకురానున్నారు. కాగా, సుధాకర్ దంపతుల మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.


మాట్లాడుతున్న వరంగల్ ఆర్ఎం శ్రీలత

లక్షే లక్ష్యం..

ఆర్టీసీలో మరో చాలెంజ్
- ఆదాయం పెంచుకునే దిశగా అడుగులు
- వరంగల్ రీజియన్‌లో ప్రారంభం

హన్మకొండ: టీఎస్ ఆర్టీసీ.. ఆదాయం పెంచుకునే దిశలో సరికొత్త చాలెంజ్‌లతో ముందుకెళ్తోంది. ఆర్టీసీ ఎండీగా వి.సి.సజ్జనార్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సంస్థ పరిరక్షణ, ఆదాయ పెంపునకు అనేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికే దసరా, రాఖీ, సంక్రాంతి, ఆల్ డిపోస్ ప్రాఫిట్ చాలెంజ్, 100 రోజుల చాలెంజ్, ఒక గొప్ప మార్పుకు ఇదే శ్రీకారం, విధుల్లో నైపుణ్యం ప్రదర్శించాలి వంటి కార్యక్రమాలు చేపట్టింది. తాజాగా 'లక్షే లక్ష్యం' అనే పేరుతో మరో చాలెంజ్ తీసుకువచ్చింది.

పెరిగిన వ్యయాన్ని పూడ్చుకునేందుకు..
ఇటీవల ఆర్టీసీ ఉద్యోగులకు యాజమాన్యం వేతన సవరణ చేసింది. వేతన సవరణ ద్వారా పెరిగిన వ్యయాన్ని పూడ్చుకునేందుకు సరికొత్త వ్యూహాలకు పదును పెట్టింది. ఇందులో భాగంగా ప్రతి డిపోలో ప్రతి రోజు ఆదాయం పెంచుకోవాలని చాలెంజ్ తీసుకువచ్చింది. రోజు అదనంగా రూ.లక్ష ఆదాయం తీసుకురావాలన్నదే 'లక్షే లక్ష్యం' చాలెంజ్. ఈ కార్యక్రమాన్ని గురువారం నుంచి ప్రారంభించారు. ఈ చాలెంజ్ ఏడాది పాటు కొనసాగుతుంది. వరంగల్ రీజియన్‌లో 9 డిపోలున్నాయి. ఈ లెక్కన రీజియన్‌లో ప్రతి రోజు అదనంగా రూ.9 లక్షల ఆదాయం తీసుకురావాలి. ఆదాయం పెంచుకోవాలంటే ప్రయాణికులను ఆర్టీసీ వైపునకు ఆకర్షించాలి. ప్రస్తుత ప్రయాణికుల సంఖ్యను పెంచుకుంటేనే ఈ చాలెంజ్‌లో రాణిస్తారు. అదనపు ట్రిప్పులు నడపడం, ప్రయాణికులను పిలిచి బస్సు ఎక్కించుకోవడం ద్వారా ఆదాయం పెంచుకోనున్నారు.

డిపోల ఆదాయ సామర్థ్యాన్ని బట్టి లక్ష్యం..
వరంగల్ రీజియన్‌లోని 9 డిపోలకు ఆయా డిపోల ఆదాయ సామర్థ్యాన్ని బట్టి లక్ష్యం నిర్దేశించుకున్నారు. వరంగల్ రీజియన్‌లో జీరో టికెట్‌తో కలిపితే రోజూ సగటున రూ.2.20 కోట్ల ఆదాయం వస్తోంది. జీరో టికెట్‌ను మినహాయిస్తే నగదు రూపేణ రోజూ సగటున రూ.1.20 కోట్ల ఆదాయం వస్తోంది. ఈ ఆదాయానికి అదనంగా మరో రూ.9 లక్షలు రాబట్టుకోవడమే ఈ చాలెంజ్ లక్ష్యం. ఆదాయం తక్కువగా వచ్చే డిపోల నుంచి అధిక ఆదాయం వచ్చే డిపోల వారీగా రోజుకు రూ.50 వేల నుంచి రూ.1.80 లక్షల ఆదాయం అదనంగా రాబట్టుకోవాలని నిర్దేశించుకున్నారు. రోజుకు రూ.9 లక్షల లెక్కన నెలకు రూ.2.70 కోట్లు, సంవత్సరానికి రూ.64.80 కోట్ల ఆదాయం సమకూర్చుకోవడమే లక్ష్యంగా వరంగల్ రీజియన్ యాజమాన్యం ముందుకెళ్తోంది. కాగా, వరంగల్ రీజియన్‌లో 'లక్షే లక్ష్యం' చాలెంజ్‌ను గురువారం హనుమకొండలోని వరంగల్–1 డిపోలో వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత ప్రారంభించారు. ప్రయాణికులను ఆర్టీసీ వైపు ఆకర్షించాలని, ప్రతి స్టేజీలో పిలిచి ఎక్కించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎం వంగల మోహన్ రావు, అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) సంతోష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.